క్లుప్తంగా

6న మండల సమావేశం

పామూరు: మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 6వ తేదీ శనివారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎల్. బ్రహ్మయ్య తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ, కోఆప్షన్‌సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు సంబంధిత శాఖల వివరాలతో హాజరుకావాలని ఎంపీడీఓ బ్రహ్మయ్య కోరారు.

పొగాకులో అన్య పదార్థాలు లేకుండా చూసుకోవాలి



టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు

టంగుటూరు: పొగాకులో అన్య పదార్థాలు లేకుండా చూసుకోవాలి, అలాంటి పొగాకు బేళ్లకు అధిక ధరలు పొందవచ్చని వేలం నిర్వహనాధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం రైతులకు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం నిర్వహించిన వేలంలో పొందూరు గ్రామానికి చెందిన రైతులు 803 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 706 కొనుగోలు చేసి 97 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.302, కనిష్ట ధర రూ.125, సరాసరి ధర రూ.206.73గా పలికింది. వేలంలో 40 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతల పరిశీలన



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న ఎంపీడీఓ హనుమంతరావు

పీసీపల్లి: మండల పరిధిలోని నేరేడుపల్లిలో ఇంకుడు గుంతలను ఎంపీడీఓ హనుమంతరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ కూడా మురుగునీరు, వర్షం నీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలకు సూచించారు. ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పథకం ద్వారా వచ్చేటువంటి ఇంకుడు గుంతలను ఇంటిముందు తీసుకొని మురుగు నీటిని గుంతలోకి వదలాలని, ఎవ్వరూ రోడ్లపైకి వదలకూడదన్నారు. సీజనల్ జ్వరాలు వస్తుంటాయని, వెంటనే స్థానిక వైద్య సిబ్బందికి సమాచారం అందిస్తే వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

దుస్తులు, పరీక్షా మెటీరియల్ పంపిణీ

పామూరు: స్థానిక కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు సోమవారం దుస్తులు, పరీక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. ఎంఈఓలు కోటిరెడ్డి, కరుణ కుమారి, పాఠశాల ఉపాధ్యాయులు మండ్లా శైలజ, జయలక్ష్మి, ఏఓ వాణి, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ ఆదాయం రూ.11.42 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయ ఆలయ హుండీ లెక్కింపు చేపట్టారు. ప్రధాన హుండీల ద్వారా రూ.10,82,065, అన్నదానం హుండీల ద్వారా రూ..60,745 వచ్చినట్లు ఈఓ, చైర్మన్ తెలిపారు.

ఆస్పత్రిలో రోగులకు అన్నదానం

కనిగిరిరూరల్: స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు, అనాథలకు సోమవారం అన్నదానం చేశారు. పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా సంస్థ పనిచేస్తోందన్నారు. స్నేహహస్తం సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది మోహన్‌కుమార్, మెర్లిన్, మహమ్మద్ గౌస్, శంకర్, ఎస్‌కే మీరా తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో మేటి..
పతకాలకు పోటీ



గురువాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాల



క్రీడా పోటీల్లో విద్యార్థులు

- గురువాజీపేట హైస్కూల్‌కు వరుసగా మూడోసారి జిల్లా క్రీడా ప్రతిభా అవార్డు..
- జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన గురువాజీపేట విద్యార్థిని



జిల్లా ఉత్తమ క్రీడా అవార్డుతో పీడీ బసవయ్యను సన్మానిస్తున్న విద్యాశాఖ అధికారులు(ఫైల్)

కనిగిరిరూరల్: కనిగిరి మండల కేంద్రానికి దూరంగా మూరుమూల గ్రామంలో ఉన్న గురువాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రతిభ అవార్డులను వరుసగా మూడోసారి కైవసం చేసుకుంది. గత నెల 30 వరకు జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన గురువాజీపేటకు చెందిన 9వ తరగతి విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. మట్టి మాణిక్యాలుగా ఉన్న ఈ పాఠశాల విద్యార్థులు బాల్ బాడ్మింటన్‌లో ప్రతిభ చాటుతూ గడిచిన 14 ఏళ్లల్లో సుమారు 350 మంది జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. వారిలో సుమారు 250 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో, 8 మంది జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు.

గురువాజీపేటలో ఘనాపాటైన క్రీడాకారులు

గురువాజీపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో సుమారు 7 గ్రామాలకు చెందిన విద్యార్థులు చదువుకుంటున్నారు. సుమారు 140 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో 6 నుంచి 10 తరగతికి చెందిన వారు సుమారు 100 మంది వరకు నిత్యం కబడ్డీ, ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్, త్రోబాల్, బ్యాట్మంటన్, వాలీబాల్, సైక్లింగ్ ఆటలు ఆడుతుంటారు. స్కూల్ గేమ్స్, అసోసియేషన్ గేమ్స్‌లు అనేక మార్లు ప్రతిభ చాటారు. ఇక ప్రభుత్వాలు నిర్వహించే సీఎం కప్, ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో గురువాజీపేట క్రీడాకారులు అనేక దఫాలు ప్రతిభను చాటారు. గడిచిన 14 ఏళ్లలో సుమారు 350 మంది క్రీడాకారులు వివిధ రకాల క్రీడల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు బాల్ బాడ్మింటన్‌లో ఎక్కువగా ప్రతిభ చాటి ప్రశంసలు పొందుతున్నారు. బాల్‌బాడ్మింటన్ (స్కూల్ గేమ్స్) పోటీల్లో గురువాజీపేట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎక్కువ మంది, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కీలక భూమిక పోషించి ఆడుతుంటారు. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులే ఎక్కువగా జిల్లా, రాష్ట్ర టీంలకు కెప్టెన్‌లుగా వ్యవహరిస్తారు. బాల, బాలికల రెండు టీం లలో మొత్తం 20 మంది ఆడాల్సి ఉండగా.. అందులో గురువాజీపేట విద్యార్థులే దాదాపు 11 మంది వరకు ఉంటారు.

పాఠశాలకు వరుసగా మూడోసారి అవార్డు ..

వ్యాయామ క్రీడాకారుని కృషి, క్రీడా విద్యార్థుల ప్రతిభతో వరుసగా జిల్లా ఉత్తమ క్రీడా ప్రతిభా అవార్డు గురువాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు దక్కింది. ఈమేరకు గత నెల 29న పీడీ బసవయ్య అవార్డును అందుకుని, విద్యాశాఖ ఉన్నతాధికారులతో సన్మానం పొందారు. 2022–23 విద్యా సంవత్సరంలో 140 పాయింట్లలో జిల్లాలో నాల్గవ స్థానంలో, 2023–24లో 170 పాయింట్లతో జిల్లాలో నాల్గవ స్థానంలో క్రీడా అవార్డు పొందగా.. తాజాగా 2024–25 విద్యాసంవత్సరంలో 240 పాయిట్లతో 2వ స్థానంలో నిలిచి జిల్లా ఉత్తమ క్రీడా ప్రతిభ అవార్డును కైవసం చేసుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో..

ప్రస్తుతం గుడ్లూరు మండలం చేవూరులో జరుగుతు రాష్ట్ర స్థాయి సీనియర్స్, సబ్ జూనియర్స్ అసోసియేషన్ క్రీడా విభాగ పోటీల్లో రాష్ట్ర టీంలో కనిగిరి మండలం గురువాజీపేటకు చెందిన విద్యార్థులు బాల్ బ్యాడ్మింటన్ విభాగంలో పాల్గొన్నారు. నాల్గు విభాగాల్లో సుమారు 15 మంది ఆడారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో గరువాజీపేటకు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఎం స్నేహ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైంది.

ఎంతో సంతోషంగా ఉంది



పాఠశాలకు వరుసగా మూడోసారి అవార్డు రావడంతో ఎంతో సంతోషంగా ఉంది. అవార్డును నేనే అందుకున్నాను. నా సర్వీసులో ఎక్కువ భాగం గురువాజీపేట పాఠశాలలోనే వ్యాయామ ఉపాధ్యాయునిగా చేశా. 2009లో జాయిన్ అయ్యాను.. ఆతర్వాత బదిలీల్లో భాగంగా 8 ఏళ్ల తర్వాత వేరే పాఠశాలకు వెళ్లాను. పదోన్నతిపై పీడీగా తిరిగి 2019లో గురువాజీపేట పాఠశాలలో చేరాను. నా సర్వీసులో సుమారు 200 మంది విద్యార్థులను వివిధ క్రీడల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీల్లో ఆడించాను. బాల్‌బ్యాడ్మింటన్‌లో ప్రత్యేక ప్రతిభ చూపేవిధంగా తయారు చేశా. 2023–24లో జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడి అవార్డు పొందాను.

– పొట్టేండ్ల బసవయ్య (పీ డీ, కంచర్లవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల)

క్రీడా ఉపాధ్యాయినిగా కావాలన్నదే లక్ష్యం



గుడ్లూరులో జరిగిన అసోసియేషన్ రాష్ట్రస్థాయి బాల్ బాడ్మింటన్ క్రీడల్లో సత్తా చాటడంతో జాతీయ జట్టును ఎంపికయ్యాను. ఈ నెల 27 నుంచి తమిళనాడులో జరిగే జాతీయస్థాయిలో పాల్గొంటున్నాను. క్రీడా కోటాలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కావాలన్నదే లక్ష్యం.

– ఎం స్నేహ, జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థిని

బాబు మోసాలను ఇంటింటికీ తీసుకెళ్దాం



బాబు షూరిటీ మోసం గ్యారంటీ క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న నేతలు

కొండపి: హామీలు అమలు చేయకుండా చంద్రబాబు ప్రజలను చేస్తున్న మోసాలను ప్రతి ఇంటికి తీసుకువెళదామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని చిన్నకండ్లగుంట పంచాయతీలోని తాటాకులపాలెం గ్రామంలో సోమవారం సాయంత్రం బాబు–షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే రెండింతలు సంక్షేమ పథకాలు ఇస్తామని ఎన్నికల్లో ఊదరగొట్టిన చంద్రబాబు 15 నెలల పాలనలో సంక్షేమ పథకాలను అటకెక్కించారన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, ఏ ఇంటికి వెళ్లిన ఇదెక్కడ ప్రభుత్వం బాబు అంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే పథకాలు అందించారని, ఇప్పుడు దరఖాస్తు చేసుకున్న పట్టించుకునే నాధుడే లేడని మండిపడ్డారు. ఎన్నికల్లో హామీల్లో ఒకటి అరకొరగా అమలు చేస్తూ మిగిలిన వాటి గురించి పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం బాబు షూరిటీ..మోసం గ్యారంటీ క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దాకా పిచ్చిరెడ్డి, సర్పంచ్ షేక్ వన్నూరు, ఓబుల్ రెడ్డి, గౌరెడ్డి రమణారెడ్డి, రవీంద్రారెడ్డి, వేముల రమేష్, శ్రీనివాసరెడ్డి, రమణారెడ్డి, కొల్లూరి సుబ్బారావు, సుబ్బయ్య సుల్తాన్, నారాయణ, గంగాధర్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్, మోటారుసైకిల్ ఢీ



తీవ్రంగా గాయపడిన రాంబాబు

సింగరాయకొండ: ప్రమాదవశాత్తు మోటారుసైకిల్‌ను ట్రాక్టర్ ఢీ కొన్న ఘటనలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సంఘటన సోమవారం సాయంత్రం మండలంలోని ఊళ్లపాలెం రోడ్డులో దేవునిబాట జంక్షన్ వద్ద జరిగింది. స్థానికుల కథనం ప్రకారం ఊళ్లపాలెంలో వినాయక నిమజ్జనం చేసుకుని వస్తున్న కొండపి మండలం తాటాకులపాలెంకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కుంచాల సుబ్రమ్మణ్యం మద్యం మత్తులో ఇష్టం వచ్చినట్లు ట్రాక్టర్‌ను అతివేగంగా నడుపుకుంటూ వస్తుండగా దేవునిబాట జంక్షన్ సమీపంలోకి రాగానే నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు పెద్ద పల్లెపాలెంకు చెందిన కొక్కిలిగడ్డ రాంబాబు రొయ్యల కంపెనీలో పని ముగించుకుని ఇంటికి తిరిగి వెళుతుండగా ట్రాక్టర్ మోటార్‌సైకిల్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో కిందపడ్డ రాంబాబు ఎడమకాలు పైకి ట్రాక్టర్ టైర్లు వెళ్లడంతో కాలు నుజ్జు నుజ్జయింది. క్షతగాత్రున్ని 108 లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. రాంబాబు జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట సమీపంలోని సదరన్ ఆక్వా కంపెనీలో పనిచేస్తున్నాడు. ట్రాక్టర్ డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు.

కూటమి నేతలను నిలదీయండి



దాదిరెడ్డిపల్లెలో బాబుష్యూరిటీ మోసంగ్యారెంటీ క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న నేతలు

పామూరు: అబద్ధపు హామీలతోనే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి గద్దెనెక్కిందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. మండలంలోని దాదిరెడ్డిపల్లె బీసీ కాలనీలో సోమవారం సాయంత్రం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ, రీకాల్ బాబూస్ మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా హుసేన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. 15 నెలల పాలనలోనే ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని ఇది సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలు, వైఫల్యాలను ప్రజలందరికీ తెలియజేసేందుకే బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ, రీకాల్ బాబూస్ మ్యానిఫెస్టో నిర్వహిస్తున్నామన్నారు. ప్రచార పత్రాలపై ఉన్న క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయడంద్వారా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అబద్ధపు హామీలు మొత్తం కనిపిస్తాయని, వీటన్నింటిపై కూటమి నేతలను ప్రజలంతా నిలదీయాలన్నారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికి వెళ్లి క్యూ ఆర్ కోడ్‌ను పత్రాలను అందజేసి మోసాలపై అవగాహన కల్పించారు. గట్లా విజయభాస్కర్‌రెడ్డి, జొన్నలగడ్డ గోవిందయ్య, శ్రీరాం శ్రీనివాసులు, ఎలికా అచ్చయ్య, కోడూరి రామసుబ్బారెడ్డి, గంటా రమణయ్య, దూపాటి జగన్, వేణు, నారాయణ, రమణయ్య, సురేష్, హరిబాబు, చీమలదిన్నె నాగరాజు, వెంకట్రావు, నరేష్, డి.ఆంజనేయులు, బద్దిపూడి జ్యోతిరావు, వరికూటి భాస్కర్, కాకర్ల చక్రవర్తి, చోడబోయిన సందీప్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ గ్రామాన వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించాలి

కనిగిరిరూరల్: మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతిని నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు స్థానిక చెక్‌పోస్టు వద్దగల వైఎస్సార్ విగ్రహానికి నివాళి, ఉదయం 9 గంటలకు గార్లపేటరోడ్డులోని విగ్రహానికి, 9.30 గంటలకు చింతలపాలెంలో, 10 గంటలకు కొత్తూరులో, 10.30 గంటలకు మాచవరంలోని వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పిస్తామన్నారు. ఉదయం 11 గంటలకు కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ వివిధ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని దద్దాల పిలుపునిచ్చారు.

వెలిగండ్ల(కనిగిరిరూరల్): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక బస్టాండ్‌లోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తామని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గజ్జెల వెంకటరెడ్డి తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తామన్నారు.

పీసీపల్లి: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని పార్టీ మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి తెలిపారు. నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అరుదైన రక్తం దానం చేసిన కానిస్టేబుల్

టంగుటూరు: గుండె శస్త్ర చికిత్స అరుదైన రక్తం అవసరం కాగా కానిస్టేబుల్ రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే..ఒంగోలులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో వ్యక్తికి ఆపరేషన్ నిమిత్తం ఏబీ పాజిటివ్ రక్తం అవసరమైంది. విషయాన్ని బ్లడ్ డోనర్స్ వాట్సాప్ గ్రూప్ ద్వారా తెలుసుకున్న టంగుటూరు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ బచ్చల చక్రవర్తి వెంటనే ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా చక్రవర్తిని ఎస్సై నాగమల్లేశ్వరరావు, సిబ్బంది, రోగి కుటుంబసభ్యులు అభినందించారు. సామాజిక బాధ్యతతో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడారని కొనియాడారు.



రక్త దానం చేస్తున్న చక్రవర్తి

బోర్డు నిర్ణయించిన మేర పొగాకు పండించాలి



నర్సరీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ శిరీష

కొండపి: బోర్డు అనుమతించిన మేర పొగాకు పండించాలని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. మండలంలోని చోడవరం, పెరిదేపి, పోలిరెడ్డిపాలెం క్లస్టర్ ఫీల్డ్ అసిస్టెంట్లకు పొగాకు నర్సరీలు సాగు చేసే రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి మాట్లాడుతూ గత ఏడాది అధి పరిమాణంలో పండించిన పంటలతో రైతులు వేలం కేంద్రాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. 2025–26 పంట కాలానికి 142 మిలియన్ల కేజీల ఉత్పత్తికి అనుమతి ఇచ్చిందన్నారు. పొగాకు పంట నియంత్రణలో భాగంగా నర్సరీ దశ నుంచి నియమాలు అమలు చేయాలని, దానికి అనుగుణంగా బోర్డు చర్యలు చేపడుతుందని తెలిపారు. నర్సరీలు వేసే యజమానులు పరిమితంగా నర్సరీలు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో చోడవరం క్లస్టర్ ఫీల్డ్ అసిస్టెంట్ మౌనిక, పెరిదేపి క్లస్టర్ ఫీల్డ్ అసిస్టెంట్ గాయత్రి, పోలిరెడ్డిపాలెం క్లస్టర్ ఫీల్డ్ అసిస్టెంట్ శిరీష, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన పోలేరమ్మ కొలుపులు

మర్రిపూడి: మండలంలోని కెల్లంపల్లిలో నూతనంగా పోలేరమ్మ ఆలయాన్ని నిర్మించారు. అమ్మవారిని ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తయిన సందర్భంగా సోమవారం గ్రామస్తులంతా కలిసికట్టుగా ఘనంగా కొలుపులు నిర్వహించారు. 8 రోజులు పాటు నిర్వహించిన కొలుపులు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మారెమ్మ, సత్యమ్మ, కనకదుర్గమ్మ, గంగమ్మ, పోలేరమ్మలకు పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ స్టూడెంట్ విభాగం మండల అధ్యక్షుడు చెరుకూరి భాస్కర్ ఆధ్వర్యంలో పోలేరమ్మ ప్రతిమలను పల్లకిపై ఉంచి గ్రామస్తులు కుంకుమ బండ్లు కట్టారు. గ్రామంలో మేళతాళాలు, డప్పువాయిద్యాలతో పోలేరమ్మతల్లిని ఘనంగా ఊరేగించారు. పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇనుకొల్లు సుబ్బారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు బోద రమణారెడ్డి, జెడ్పీటీసీ మాకినేని సుధారాణి, వెంకట్రావు, నాయకులు చెరుకూరి శ్రీనివాసులు, రావూరి వెంకటేశ్వర్లు, మల్లెల సుబ్బారావు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు మునపాటి నరసింహారావు, నారాయణరెడ్డి, మొల్లల ప్రభాకర్‌రెడ్డి, బైరపనేని వెంకట్రావు, బైరపనేని రమణయ్య, ముప్పవరపు కేశవ, నెలకుర్తి రాఘవరావు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

రైతులు విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



నారు మడులను పరిశీలిస్తున్న బోర్డు అధికారులు

కనిగిరిరూరల్: పొగాకు నారుమడులు సాగు చేసే రైతులు విధిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వేలం నిర్వహణాధికారి బి.కోటేశ్వరరావు అన్నారు. పట్టణ సమీపంలో మాచవరం గ్రామంలో జరుగుతున్న పొగ నారుమడుల సాగు పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పొగాకు రైతులకు, నారుమడుల సాగు చేస్తున్న రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి రైతు గరిష్టంగా రెండు హెక్టార్ల వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని తెలిపారు. ప్రతి నారుమడి ప్రాంగణంలో రైతు తప్పనిసరిగా ఫ్లెక్సీలో ఏర్పాటు చేసి అందులో పూర్తి వివరాలు పొందుపరచాలని తెలిపారు. నారుమడులు రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతుకు బోర్డు అమ్మకాలకు సంబంధించిన రసీదు పుస్తకాలు అందజేస్తామన్నారు. పొగాకు సాగు చేసే రైతులు విధిగా రిజిస్ట్రేషన్ ఉన్న నర్సరీల నుంచి మాత్రమే నారు కొనుగోలు చేయాలన్నారు. పొగాకు నాట్లు సమయంలో బోర్డు అధికారులు అందిస్తున్న ఫారం–2తో పాటు, నారు అమ్మిన నర్సరీ యజమాని ఇచ్చిన రసీదును జతపరిచి సంబంధిత అధికారులకు ఇవ్వాలన్నారు. రిజిస్ట్రేషన్ లేని వారు నారుమడుల నుంచి నారు కొనుగోలు చేసి పొగాకు సాగు చేస్తే పొగాకు రైతుల రిజిస్ట్రేషన్ నిలుపుదల చేస్తామన్నారు. ఫీల్డ్ అధికారి కె.అనిత, టీఎఫ్ ఏ ప్రత్యూష, ఎఫ్ఏ షారూక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పెన్షన్ ఇవ్వాలి

కనిగిరిరూరల్:

అర్హులందరికీ పెన్షన్ మంజూరు చేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. సోమవారం పట్టణంలోని కాశిరెడ్డి కాలనీలో జరిగిన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో అర్హులందరికీ పింఛన్ మంజూరు చేశామన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రీ వెరిఫికేషన్ పేరితో దివ్యాంగుల పింఛన్లను తొలగించడం సరైంది కాదన్నారు.

రూ.1.20 లక్షలు పలికిన లడ్డూ ప్రసాదం

కనిగిరిరూరల్: పట్టణంలోని కొత్తపేటలో గణపతి నిమజ్జనోత్సవం సందర్భంగా విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో లడ్డు వేలం పాట జరిగింది. ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రథమ లడ్డును పట్టణానికి చెందిన నూనే అంజన్‌కుమార్ రూ.1.20 లక్షలకు పాడుకున్నారు. రెండో లడ్డును రూ.70,116లకు వైఎస్సార్ సీపీ వైద్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి పాడారు.